

దిక్కున్నచోట చెప్పుకోండి!
తిరుపతి రూరల్ మండలం పేరూరులో టీడీపీ నేతలు కబ్జాలకు పాల్పడుతున్నారు. ప్రశ్నించిన వారిపై దాడికి దిగుతున్నారు. - 8లో



'బిందు'.. రైతు బంధు
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించింది. రైతులకు రాయితీపై పరికరాలను అందించింది. - 8లో



హాస్టల్ సమస్యలు పరిష్కరించండి
ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు కోరారు. - 8లో

న్యూస్‌రీల్

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం



తిరుచ్చిపై ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం శ్రీవారికి అభిషేక సేవ జరిపించారు. వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను మండపానికి వేంచేపు చేసి కనులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుద్దీపాల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదారు చిరంజీవి పాల్గొన్నారు.

సింహ వాహనంపై వీరభద్రుడు



ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

నారాయణవనం: టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం రాత్రి స్వామి, అమ్మవార్లను సింహవాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఈ క్రమంలో వేకువనే దేవదేవేరులకు విశేష పూజలు నిర్వహించి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి వేడుకగా స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం కనులపండువగా సింహవాహన సేవ చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. ఆదివారం సాయంత్రం భూత వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఏపీ కరాటే సంఘం అధ్యక్షుడిగా భాస్కర్



సత్యవేడు: ఏపీ కరాటే సంఘం అధ్యక్షుడిగా సత్యవేడుకు చెందిన ఎం ఏ. భాస్కర్, జనరల్ సెక్రటరీగా నాగలాపురానికి చెందిన డి.హేమకుమార్‌ను నియమిస్తూ నేషనల్ కరాటే ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రాజుతప్ప ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఈ మేరకు నియామక పత్రం అందుకున్నట్లు భాస్కర్ వెల్లడించారు. ఈ సందర్భంగా కరాటే సంఘం సభ్యులు మదన్, హరి, సాగర్, చెన్‌తామరై, గణేష్, ధనుష్ అభినందనలు తెలిపారు.

భద్రత ముక్కంటికెరుక!



నిరుపయోగంగా లగేజీ స్కానర్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భద్రత చర్యలు తూతూమంత్రంగా ఉన్నాయి. నిత్యం వేలాది మంది భక్తులు వచ్చే క్షేత్రంలో నిఘా వ్యవస్థలో డొల్లతనం బహిరంగంగానే కనిపిస్తోంది. భద్రత కోసం కొనుగోలు చేసిన పరికరాలు మూలన పడ్డాయి. పట్టించుకునేవారు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. తూర్పు గోపురం, దక్షిణ గోపురాల వద్ద ఏర్పాటు చేసిన లగేజీ స్కానర్లు సరిగా పనిచేయడం లేదు. మెటల్ డిటెక్టర్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. చేతి డిటెక్టర్లు కూడా కనిపించడంలేదు. లగేజీ బ్యాగులను స్కానింగ్ చేసిన తర్వాతే ఆలయంలోకి తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే స్కానర్లు పనిచేయవు. ఎస్‌పీఎఫ్ , హోంగార్డులు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని భద్రత కోసం వినియోగిస్తున్నా సెల్‌ఫోన్లు, కెమెరాలు, లగేజీని తీసుకుని భక్తులు ఆలయంలోకి వెళ్లిపోతున్నారు. ఏటా సుమారు రూ.150 కోట్లు ఆదాయం వస్తున్నా.. భద్రత విషయంలో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలేదు. భద్రతా పరంగా మరిన్ని చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులు నివేదికలు ఇచ్చినా అవి అమలు కావడంలేదు.



బాబు తీరు.. చౌకబారు!



ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందించాలి.. ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావాలి.. జవాబుదారీతనంతో జనాలకు మేలు చేకూర్చాలి.. ఈ క్రమంలోనే నిరుపేదల కడుపు నింపే నిత్యావసరాలను పారదర్శకంగా పంపిణీ చేయాలి.. ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారుల ఇంటి ముంగిటకే రేషన్ సరుకులను అందజేయాలి.. ఇదే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ సర్కార్ చిత్తశుద్ధితో పనిచేసింది. క్షేత్రస్థాయిలో గడప గడపకు మంచి చేసింది. అయితే కూటమి పాలన మొదలైన తర్వాత చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఒక్కొక్కటిగా పథకాలకు మంగళం పాడేస్తున్నారు. అందులో భాగంగా ఇంటింటికీ రేషన్ పంపిణీకి తిలోదకాలు ఇచ్చేశారు. పేదల పొట్టకొట్టి 'పచ్చ'గద్దలకు ఫలహారం అందించేందుకు రంగం సిద్ధం చేశారు. ఎండీయూ ఆపరేటర్ల జీవనోపాధిని ప్రశ్నార్థకంగా మార్చేశారు. కార్డుదారులు సరుకుల కోసం చౌకదుకాణాల ఎదుట బారులు తీరే దుస్థితి కల్పించారు.

- రేషన్ బండికి తిలోదకాలు
- ఎండీయూ వాహనాలను నిలిపేయాలని ఆదేశాలు
- వృద్ధులు.. దివ్యాంగులు.. గ్రామీణులకు ఇబ్బందులు
- సంక్షేమ పథకాల నిర్వీర్యమే లక్ష్యంగా అడుగులు
- కూటమి ప్రభుత్వ వైఖరిపై సర్వత్రా విమర్శలు

తిరుపతి అర్బన్ : పేదలకు ఉచిత బియ్యంతోపాటు నిత్యావసరాలను కార్డుదారులకు వందశాతం అందించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా చేసేందుకు ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్కో పంచాయతీ పరిధిలో మూడు నుంచి నాలుగు గ్రామాలు ఉంటాయి. అయితే చౌకదుకాణం గ్రామ పంచాయతీ కేంద్రంలో మాత్రమే ఉంటుంది. దీంతో ఆ పంచాయతీలోని ఇతర గ్రామాలకు చెందిన వారు సరుకులు తెచ్చుకోవడం భారంగా ఉండేది. పలుచోట్ల రెండు మూడు రోజులకే డీలర్లు సరుకులు లేవని చెప్పేసేవారు. 70శాతం నుంచి 80 శాతానికి మించి సరుకులు ఇచ్చేవారు కాదు. ఈ క్రమంలో అందరికీ సరుకులు అందించాలనే సదుద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దకే వచ్చి సరుకులు అందించేది. దీంతో లబ్ధిదారులు సంతోష పడేవారు. ఈ మేరకు సరుకుల పంపిణీ కూడా 82శాతం నుంచి 87శాతానికి పెరిగింది. 90 నుంచి 95 శాతం కార్డుదారులకు సరుకులు ఇచ్చేలా గత ప్రభుత్వం ప్రణాళికలు సైతం సిద్ధం చేసింది.



పౌరసరఫరా అస్తవ్యస్తం

పౌరసరఫరాల వ్యవస్థను అస్తవ్యస్తం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఓ వైపు ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. మరోవైపు రాజకీయ కక్షతో ఎక్కడికక్కడ రేషన్ డీలర్లను తొలగిస్తోంది. జిల్లాలో మొత్తం 1,457 మంది డీలర్లు ఉంటే, వారిలో 221 మందిపై ఇప్పటికే వేటు వేసింది. ఆయా స్థానాల్లో టీడీపీ కార్యకర్తలకు అవకాశం కల్పిస్తోంది. పైగా మీ ఇష్టం వచ్చినట్టు సరుకులు అమ్ముకోండి.. ఎలాంటి తనిఖీలు ఉండవు అంటూ పచ్చమూకలను ఉసిగొల్పింది. దీంతో డీలర్ల అవతారం ఎత్తిన టీడీపీ శ్రేణులు ఇక సరుకులు పంపిణీ చేయడం ప్రశ్నార్థకమే అని కార్డుదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రెండు నెలలుగా ప్రభుత్వం బియ్యం మాత్రమే సరఫరా చేస్తోంది. కందిపప్పు, చక్కెర, గోధుమ పిండి, రాగులు, రాగిపిండి, ఇతర సరుకులను ఇవ్వడం లేదని కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటికీ ఎందుకు పంపాలి..?

పౌరసరఫరాలశాఖ మంత్రిగా నాదెండ్ల మనోహర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇంటింటికీ రేషన్ పంపిణీపై విషంగక్కారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకు వెళ్లి సరుకులను ఇవ్వడమేంటి అని ప్రశ్నించారు. ఈ పథకాన్ని రద్దు చేయాల్సి ఉందని ప్రకటించారు.ఆ మేరకు ఇటీవల విజయవాడలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టంగా వెల్లడించారు. ఎండీయూ వాహనాలను నిలుపుదల చేయాలని, రేషన్ డీలర్ల వద్దకే వెళ్లి కార్డుదారులు సరుకులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసేశారు. దీంతో ఇకపై కార్డుదారులు మళ్లీ రేషన్ డీలర్ల వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పల్లెవాసులు మళ్లీ పంచాయతీ కేంద్రానికే సరుకుల కోసం వెళ్లాల్సి వస్తోంది. వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి రేషన్ దుకాణాల ఎదుట క్యూలో నిలబడాల్సిన దుస్థితి దాపురించింది. ఈ మేరకు సరుకుల పంపిణీ శాతం కూడా గణనీయంగా తగ్గిపోయే అవకాశముంది.

ఉపాధి కోల్పోతున్న ఆపరేటర్లు

ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయడంతో జిల్లాలోని 369 మంది ఆపరేటర్లు ఉపాధి కోల్పోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2021లో రూ.5.8లక్షల విలువైన వాహనాన్ని 90 శాతం రాయితీ ఇచ్చి బ్యాంక్ రుణంతో అందించింది. ఈ క్రమంలో వాహనదారులు కేవలం రూ.3 వేలు చెల్లిస్తే, ప్రభుత్వం రూ.8 వేలు కట్టేది. ఈ క్రమంలోనే ఎండీయూ ఆపరేటర్లకు ప్రతి నెలా రూ.21వేల వేతనం అందించేంది. అందులో బ్యాంక్ రుణానికి రూ.3వేలు పోయినా, మిగిలిన రూ.18వేలను ఆపరేటర్లు కుటుంబపోషణకు వినియోగించుకునేవారు. ఈ ఒప్పందాన్ని ఆరేళ్ల తర్వాత రెన్యూవల్ చేస్తామని సైతం హామీ ఇచ్చింది. దీంతో ఎండీయూ ఆపరేటర్ల భవిష్యత్‌కు భరోసా వచ్చింది. ఇప్పుడు ఎండీయూ వాహనాలను కూటమి సర్కారు రద్దు చేయడంతో వారి జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది.



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకుల పంపిణీ (ఫైల్)

మా బతుకులను చిదిమేయకండి



చిన్న కుటుంబాలకు చెందినవాళ్లం. మా బతుకులను చిదిమేయకండి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తీసుకువస్తే 10శాతం చెల్లించి వాటిని దక్కించుకున్నాం. క్రమం తప్పకుండా ప్రతి నెలా సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ చేశాం. డీలర్లు, కార్డుదారులకు పూర్తిగా సహకరించాం. రేషన్ బండితోనే మూడేళ్లుగా మా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ఇప్పుడు మా బండ్లు నిలిపేస్తామంటే ఎలా. మా పరిస్థితి ఏంటి.– అబ్దుల్ రజాక్, ఆపరేటర్, ఎల్‌బీసీ రోడ్డు, తిరుపతి

నిలబడే ఓపిక లేదు



మాకు ఆరోగ్యం సరిగా లేదు. ఈ ట్రాఫిక్‌లో రేషన్ డీలర్ వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకునే శక్తి మాకు లేదు. ఇదివరకు రేషన్ బండి నేరుగా మా ఇంటి వద్దకే వస్తుంటే హాయిగా సరుకులు పొందాం. ఇప్పుడు మళ్లు డీలర్ల వద్దకు వెళ్లి గంటల కొద్దీ క్యూలో నిలబడే ఓపిక లేదు. మాలాంటి అభాగ్యుల ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. రేషన్ బండి ద్వారా సరుకులు పంపిణీ చేస్తే మాకు సౌకర్యంగా ఉంటుంది.
– చెంగయ్య, లీలామహల్ దగ్గర, తిరుపతి

నోటికాడ కూడు తీసేశారు



ప్రతి నెలా కార్డుదారుల ఇంటి వద్దకే వెళ్లి సరుకులు అందిస్తున్నాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన అవకాశంతో ప్రజా సేవ చేసుకున్నాం. దీనికితోడు వాహనం సొమ్ములో 10శాతం చెల్లించాం. అప్పట్లో వేరే అవకాశాలు వచ్చినా వదులుకున్నాం. ఇప్పుడు ఎండీయూ వాహనాలను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇవ్వడం సరికాదు. మేం ఎటూ కాకుండా పోతాం. మా నోటి కాడ కూడు తీసేశారు. ఇది అన్యాయం. – ఇస్మాయిల్, ఎండీయూ ఆపరేటర్, నెహ్రూ వీధి, తిరుపతి

ఇంటి వద్దనే సౌకర్యం



ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దనే సరుకులు తీసుకోవడం చాలా సౌకర్యంగా ఉండేది. గతంలో రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి నిలబడాల్సి వచ్చేది. ఈ వాహనాలు వచ్చిన తర్వాత సరుకులు పొందడం సులభతరంగా మారింది. అప్పట్లో డీలర్లు సక్రమంగా రేషన్ ఇచ్చేవారు కాదు. అదే ఆపరేటర్లు అన్నింటినీ పక్కాగా పంపిణీ చేస్తున్నారు. అందులోనూ మాకు రేషన్‌షాపు చాలా దూరం. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకుంటే మంచిది.
– అజిత్, కారూరు, పిచ్చాటూరు మండలం

అనుకూలంగా ఉండేది



ఇంటి వద్దకే రేషన్ బండి వచ్చి సరుకులు ఇవ్వడం చాలా అనుకూలంగా ఉండేది. మూడేళ్లుగా ఈ విధానం సాఫీగా సాగుతోంది. ఇప్పుడు వాటిని రద్దు చేయడం తప్పుడు నిర్ణయమే. కార్డుదారులకు మళ్లీ అగచాట్లు తప్పవు. వయసు మీరినవారు, దివ్యాంగులు వెళ్లి డీలర్ల ఎదుట క్యూలో నిలబడడం దారుణంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రేషన్ బండ్లను తొలగించే విషయంలో పునరాలోచన చేయాలి.
– అంకయ్య, సుబ్బానాయుడుకండ్రిగ, నాగలాపురం మండలం

మళ్లీ కష్టాలు పడాల్సిందే!



గతంలో రేషన్ సరుకుల కోసం వెళితే డీలర్లు సరిగా స్పందించేవారు కాదు. ప్రతి నెలా రెండు మూడు సార్లు ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలు ఇంటి వద్దకే వచ్చి సరుకులు పంపిణీ చేసేవి. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి నెలా రేషన్ తీసుకునేవాళ్లం. ఇప్పుడు కూటమి సర్కారు వాటిని రద్దు చేయడంతో మళ్లీ రేషన్ కోసం కష్టాలు పడాల్సిందే. – రాజశేఖర్, లక్ష్మీపురం, తిరుపతి

ముగిసిన మెడికాన్ సమావేశాలు



అధ్యాపకులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో వైద్య విద్యా బోధన విభాగం, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ వారు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ 14వ వార్షిక మెడికాన్ సమావేశాలు శనివారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా విజయవాడ వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ రఘునందన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేడు మనిషి ఆరోగ్యంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయని తెలిపారు. అధ్యాపకులు నూతన వైద్య విద్యపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పేద రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించడంలో ఏపీ ప్రథమ స్థానంలో ఉందన్నారు. అనంతరం వైద్య అధ్యాపకులకు నేషనల్ మెడికల్ కమిషన్ సౌజన్యంతో ప్రవేశపెట్టిన నూతన వైద్య విద్య, బోధన, పరీక్షల ప్రక్రియలో మార్పులపై చర్చించారు. వైద్య విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి నిపుణులు వివరించారు. వైద్య అధ్యాపకులు డాక్టర్ విష్ణుభట్, పీయూష్ గుప్త, శంకర్ సచికేత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

తిరుపతి సిటీ: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ఆప్షన్లు ఎంపిక చేసుకున్న విద్యార్థులకు శనివారం మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని 17 ప్రభుత్వ, 122 ప్రైవేటు, 3 టీటీడీ డిగ్రీ కళాశాలల్లో తమకు కేటాయించిన కళాశాలల్లో ఎంపిక చేసుకున్న కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రవేశాలు పొందాల్సి ఉంటుంది.

ఎల్‌ఎల్‌బీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ పరీక్షల ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మూడు, ఏడవ సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడించారు.

ల్యాబ్ టు క్లినిక్‌పై అవగాహన

తిరుపతి సిటీ:శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శనివారం ల్యాబ్ టు క్లినిక్ ఇండియాస్ స్ట్రేటజిక్ రోడ్‌మ్యాప్ ఇన్ ది ఎక్స్‌ట్రా సెల్యూలార్ వేసికల్ రెవల్యూషన్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సావేరీ సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త డాక్టర్ శశిధర్ హాజరై క్యాన్సర్ పురోగతి, న్యూరో డిజనరేటివ్ డిసీజెస్‌ను వివరించారు.

• తిరునగరం.. జలమయం



కరకంబాడి రోడ్డులో వర్షపు నీటి ఉధృతి.. వాహనదారుల ఇక్కట్లు

తిరుపతిలో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. రోడ్లపై వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కాలువలు పొంగడంతో నివాసాల మధ్య చెత్తాచెదారాలతో కూడిన మురుగు చేరింది. నగరంలో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మోకాటిలోతు నీటితో రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడ్డారు. ప్రధాన వీధుల్లో పాదచారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. పలు కాలనీల్లో నీటితోపాటు పాములు.. విషపురుగులు కొట్టుకురావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ఇళ్ల మధ్యకు నీరు రావడంతో ఆందోళన చెందుతున్న స్థానికులు



రాఘవేంద్రనగర్ వద్ద రోడ్డుపై ..



మోకాటిలోతు నీటిలో రోడ్డు దాటుతున్న మహిళలు

క్లుప్తంగా

డీజిల్ దొంగల అరెస్ట్

పాకాల : రహదారిపై ఆగి ఉన్న వాహనాల నుంచి డీజిల్‌ను అపహరిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రాత్రి నేంద్రగుంట సమీపంలో ఓ మినీ లారీ నుంచి డీజిల్ దొంగలించినట్లు లారీ ఓనర్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమరాల ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు సమాచారం.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


చంద్రబాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లె మండలం నిండలి గ్రామంలేఓ శనివారం వేకువజామున అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన వెందోటి చంద్రబాబు అలియాస్ వెంకటేశ్వర్లు తిరుపతిలోని ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో ఇల్లు నిర్మించుకుని శుక్రవారం గృహప్రవేశం చేశాడు. ఇంతలో ఏమైందో తెలియదు కానీ, సమీపంలోని రోడ్డు పక్కన మృతదేహంగా కనిపించాడు. మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బాలికపై లైంగిక వేధింపులు

చిత్తూరు అర్బన్: పొట్టకూటి కోసం వేరే దేశానికి వెళుతూ.. తన కుమార్తెను చూసుకోమని స్నేహితురాలికి అప్పగించిన పాపానికి చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న తల్లి తన స్నేహితురాలు ఆమె భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. చిత్తూరు టూ టౌన్ సీఐ వలసయ్య కథనం మేరకు, చెన్నైకు చెందిన మహిళ కొంతకాలంగా చిత్తూరులో ఉంటుంది. ఇటీవల ఆమె ఉద్యోగం కోసం దుబాయ్ వెళుతూ తన ఆరేళ్ల కుమార్తెను చిత్తూరులోని కాజూరుకు చెందిన తన స్నేహితురాలు పవిత్రకు అప్పగించి వెళ్లింది. మూడు నెలలుగా బాలిక తన తల్లితో ఫోన్లో మాట్లాడుతూ తనను ఇక్కడ కొడుతున్నారంటూ చెప్పింది. చెన్నైలో ఉన్న తన బంధువులను పంపించి, పాపను చెన్నైలో ఉంచుకోవాలని కోరింది. బాలిక శరీరంపై గాయాలు ఉండడంతో చెన్నైలోని ఆమె బంధువులు వైద్యుడి దగ్గరికి తీసుకెళ్లారు. బాలికను పరిశీలించిన వైద్యుడు ఈమెపై లైంగిక దాడి జరిగిన విషయాన్ని చెప్పాడు. దుబాయ్ నుంచి చెన్నైకి వచ్చిన బాలిక తల్లి, పాపతో మాట్లాడితే పవిత్ర ఆమె భర్త సతీష్ ఇద్దరూ కలిసి నిత్యం లైంగిక దాడికి పాల్పడేవారని చెప్పింది. శనివారం చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

‘బిందు’.. రైతు బంధు

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రాధాన్యం
- పాలకుల చిత్తశుద్ధితో బీడు భూములు సైతం సస్యశ్యామలం
- తక్కువ నీటితో అధిక దిగుబడి.. ఆదాయం
- వాణిజ్య పంటల సాగులో సత్తా చాటిన మహిళలు


డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగును సంబరంగా తీర్చిదిద్దింది. వ్యవసాయానికి చిత్తశుద్ధితో సహకారం అందించింది. అందులో భాగంగా గత ఏడాది 5వేల ఎకరాలకు బిందు సేద్యం పరికరాలను రాయితీపై పంపిణీ చేసింది. తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడి సాధించేదిశగా రైతులను ముందుకు నడిపించింది. డ్రిప్‌తో పాటు స్ప్రింక్లర్లను సైతం సబ్సిడీపై అందజేసి ప్రోత్సహించింది. తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా రెండు సీజన్లకు నీరు సరఫరా చేసింది. సంక్షేమ పథకాలతో వెన్నుదన్నుగా నిలిచింది. సర్కారు చేయూతను మహిళలు సైతం అందిపుచ్చుకున్నారు. బీడు భూములను సాగులోకి తీసుకువచ్చి సస్యశ్యామలం చేశారు. ముఖ్యంగా వాణిజ్య పంటల ఉత్పత్తిని కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకుంటున్నారు.

– తిరుపతి అర్బన్

బంగారం పండుతోంది!


గత ప్రభుత్వంలో ఇచ్చిన డ్రిప్ పరికరాలను చూపుతున్న వరమ్మ

ఈమె పేరు ఎస్.వరమ్మ. శ్రీకాళహస్తి నియోజకవర్గం. తొట్టంబేడు మండలం బోనుపల్లె గ్రామం. ఆమెకు 79 సెంట్ల భూమి ఉంది. పదేళ్లుగా కాకరకాయలనే పండిస్తోంది. పొలం పక్కనే ఉన్న కాలువలో నీరు వస్తేనే సాగు చేయాల్సిన పరిస్థితి. సక్రమంగా నీరు అందక ఆశించిన మేరకు దిగుబడి వచ్చేది కాదు. ఒక్కో సీజన్‌లో కేవలం 5 క్వింటాళ్ల పంట మాత్రమే చేతికొచ్చేది. పెట్టుబడి రూ.20వేలు అయితే, రూ.20వేల నుంచి రూ.25వేల రాబడి వస్తుండేది. చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తూ ఉండేది. ఈ క్రమంలో గత ఏడాది నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 90శాతం రాయితీపై డ్రిప్ పరికరాలను అందించింది. వరమ్మ తన వాటాగా 10శాతం కింద కేవలం రూ.6,150 చెల్లిస్తే, మిగిలిన రూ.55,432లను ప్రభుత్వం భరించింది. దీంతో బిందు సేద్యం చేపట్టిన వరమ్మకు కాకర పంట ఏకంగా 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. విక్రయిస్తే రూ.లక్ష చేతికందింది. పెట్టుబడి పోను రూ.80వేల ఆదాయం మిగిలింది. కేవలం 45 రోజుల్లోనే తక్కువ నీటి వినియోగంతో 5 ఎకరాల్లో సాగు చేస్తే వచ్చేంత దిగుబడి రావడంతో ఆ మహిళా రైతు ఆనందానికి హద్దే లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సాయంతో తమ పొలంలో బంగారం పండుతోందని ఆనందంగా చెబుతోంది.


సాగుచేసిన కాకర తోట వద్ద రైతు వరమ్మ

ఆత్మవిశ్వాసం పెరిగింది


గత ప్రభుత్వంలో సబ్సిడీపై తీసుకున్న స్ప్రింకర్ వద్ద దేవసేన

ఈమె పేరు దేవసేన. గూడూరు నియోజకవర్గం. చిల్లకూరు మండలం మోమిడి గ్రామం. ఈమెకు 4 ఎకరాల భూమి ఉంది. ఎప్పుడూ వేరుశనగ పంటనే సాగు చేసేది. సక్రమంగా సాగునీరు అందకపోవడంతో ఏటా కేవలం 3 టన్నుల దిగుబడి మాత్రమే వచ్చేది. దీంతో వచ్చిన కాస్త సొమ్ము పెట్టుబడికే సరిపోయేది. అయితే 2022–23లో నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 90శాతం రాయితీపై అందించిన స్ప్రింక్లర్లను పొందింది. వీటి సాయంతో వేరుశనగ సాగును మళ్లీ చేపట్టింది. తక్కువ నీటితోనే 5 టన్నుల దిగుబడి సాధించింది. నాణ్యమైన పంట చేతికొచ్చింది. దీంతో వ్యాపారులు సైతం ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు పొలం వద్దకే వచ్చేశారు. టన్ను కాయలను రూ.30వేల చొప్పున విక్రయిస్తే రూ.1.5లక్షలు వచ్చింది. పెట్టుబడి రూ.60వేలు పోగా, రూ.90వేల ఆదాయం వచ్చింది. ఈ క్రమంలో రెండో సీజన్‌లో సైతం వేరుశనగ సాగు మొదలుపెట్టేందుకు దేవసేన మొగ్గుచూపుతోంది. గత వైఎస్సార్‌సీపీ అందించిన భరోసా ఆత్మవిశ్వాసం పెరిగిందని, బిందు సేద్యం బాటన మొక్కవోని ధైర్యంతో మరింతగా పంటల సాగు చేపడతామని వెల్లడిస్తోంది.


వేరుశనగ ఒబ్బిడి చేయిస్తున్న రైతు దేవసేన

దూషణ.. మహిళ ఆవేదన


స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన కూర్చుని ఉన్న వరలక్ష్మి

చిల్లకూరు : భర్త వేధింపులు భరించలేక న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళితే దూషణలు ఎదుర్కోవాల్సి వచ్చిందని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. వివరాలు.. మండలంలోని చింతవరం కొత్తపాళానికి చెందిన వరలక్ష్మికి చిట్టమూరు మండలం మెట్ట గ్రామానికి చెందిన చిన్న అనే వ్యక్తితో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తడంతో ఆమె బిడ్డలను తీసుకుని తన అమ్మ ఊరు అద్దెపల్లెకి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తన భర్తను పిలిపించి మాట్లాడి తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆమె రెండు రోజులుగా పోలీస్‌స్టేషన్‌కు తిరుగుతోంది. ఈ క్రమంలో పోలీసులు తనను తీవ్రంగా దూషిస్తున్నారని వాపోయింది. దీనిపై స్టేషన్ రైటర్ నాగూరయ్యను వివరణ కోరగా.. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డికి వరలక్ష్మి ఫిర్యాదు చేసిందని, ఆయన ఆదేశాల మేరకు ఆమె భర్తను స్టేషన్‌కు తీసుకువచ్చామన్నారు. అయితే అతడికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సెల్‌ఫోన్ తీసుకుని గూడూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించామని వెల్లడించారు. ఈలోపు స్టేషన్‌కు వచ్చిన వరలక్ష్మి తన భర్తను అప్పుడే పంపిచేస్తారా అని వాగ్వాదానికి దిగిందన్నారు. అతడి సెల్‌ఫోన్ తమ వద్దే ఉందని చెబితే, ఫోన్ లాక్కుని నేలకేసి కొట్టిందని చెప్పారు. అప్పుడు ఆమెను వారించేందుకు యత్నించామే కానీ, ఏమాత్రం దూషించలేదని స్పష్టం చేశారు.

దిక్కున్న చోట చెప్పకోండి!

- పేరూరులో ఆగని కబ్జాల పరంపర
- అధికారులనే బెదిరిస్తున్న టీడీపీ నేతలు
- యథేచ్ఛగా షెడ్ల నిర్మాణం

తిరుపతి రూరల్: ''మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. మా నాయకుడు చెప్పారు.. ఎన్నికల్లో పెట్టిన ఖర్చును రాబట్టుకోవాలి.. అందుకే కాలువను కబ్జా చేస్తున్నాం.. షెడ్లు నిర్మిస్తున్నాం.. మీకు దిక్కున్న చోట చెప్పుకోండి..ఆపాలని చూస్తే బదిలీల్లో శంకరగిరి మాన్యాలు పట్టిస్తాం''.. అంటూ రెవెన్యూ, పోలీసు అధికారులను టీడీపీ నేతలు హెచ్చరించారు. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో సర్వే నంబర్ 460లోని కాలువ పోరంబోకును టీడీపీ నేతలు కబ్జా చేశారు. కాలువ గడ్డను జేసీబీలతో ధ్వంసం చేసి పూడ్చివేస్తున్నారు. జూలై 27వ తేదీ నుంచి ఈ కబ్జాల పరంపర కొనసాగుతోంది. రెవెన్యూ అధికారులు వచ్చి అడ్డుకున్నా వారిని బెదిరిస్తున్నారు. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తే వాటిని విరిచేస్తున్నారు. బోర్డులు పెడుతున్న రెవెన్యూ అధికారులపై దాడికి తెగబడుతున్నారు. దీంతో వారు చేసేదిలేక పోలీసుల రక్షణ కోరారు.

పోలీసుల సమక్షంలోనే హెచ్చరికలు

కాలువను కబ్జా చేసేందుకు శనివారం మరోసారి టీడీపీ నేతలు ప్రయత్నించారు. ఉదయం నుంచి కాలువ గట్టుపైనే మద్యం సేవిస్తూ, 30 మందిని పోగేసుకుని పట్టపగలే షెడ్డుల నిర్మాణానికి తెగించారు. స్థానికులు అడ్డుకునేందుకు వస్తే వారిపై మద్యం మత్తులో దాడికి ప్రయత్నించారు. పంచాయతీ వీఆర్‌ఓ దిలీప్‌కు సైతం వార్నింగ్ ఇచ్చారు. దీంతోఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వీఆర్‌ఓ ఫిర్యాదు చేశాడు. ఆక్రమణల తొలగించేందుకు రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆర్‌డీఓ ఆదేశించారు. దీంతో రూరల్ ఎస్‌ఐ నాగేంద్రబాబు, వీఆర్‌ఓ దిలీప్, పోలీస్ సిబ్బందితో కలిసి కాలువ కబ్జా చేస్తున్న ప్రాంతానికి వెళ్లారు. అక్రమ నిర్మాణాలను ఆపాలని ఆదేశించారు. దీంతో మరోసారి టీడీపీ నేతలు రెచ్చిపోయారు. 'అన్న చెప్పాడు...మా ఇష్టం వచ్చినట్టు చేస్తాం.. షెడ్లను నిర్మించి తీరుతాం.' అంటూ తెగేసి చెప్పారు. రెచ్చిపోతున్న టీడీపీ నేతలను అడ్డుకోలేక పోలీసులు వెనుదిరిగారు. దీంతో కాలువ భూమిలో షెడ్ల నిర్మాణాన్ని పచ్చమూక యథేచ్ఛగా కొనసాగించారు. సాయంత్రానికి నిర్మాణం పూర్తి చేయడమే కాకుండ దానికి అప్పటికప్పుడే సున్నం వేసి పాతది మాదిరి కలరింగ్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇది గమనించిన టీడీపీలోనే మరోవర్గం నేతలు కూడా కాలువను రెండో వైపు నుంచి కబ్జా చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కాలువను పూడ్చివేసేందుకు టిప్పర్లతో మట్టిని పోయిస్తున్నారు. 'మాకు మాత్రమే అన్న చెప్పాడు.. మేము మాత్రమే కబ్జా చేసుకోవాలి.. మీరు ఈవైపు వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఓ ఎంపీటీసీ మాజీ సభ్యుడు హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోకలి బండతో దాడి : ఒకరి మృతి


వివరాలు సేకరిస్తున్న పోలీసులు


జకీర్(ఫైల్)

గూడూరురూరల్ : పట్టణంలో రెండు కుటుంబాల వారు ఘర్షణకు దిగడంతో ఒకరు మృతి చెందారు. వివరాలు.. స్థానిక బనిగేసాహెబ్ పేటకు చెందిన అల్లా బక్షుఅ అనే వ్యక్తి మసీదు ప్రాంతానికి చెందిన సోనియాను వివాహం చేసుకున్నాడు. ఇరువురి మధ్య వివాదం తలెత్తడంతో కొద్దిరోజులుగా విడిగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సోనియా, ఆమె సోదరులు జకీర్, షకీర్ మాట్లాడుకుంటూ ఉండగా భర్త అల్లాబక్షు తన తల్లిదండ్రులతో కలిసి అక్కడకు వచ్చాడు. మాటా మాటా పెరగడంతో కోపం పట్టలేని అల్లాబక్షు రోకలి బండతో సోనియా, ఆమె సోదరులపై దాడి చేశాడు. ఈ దాడిలో సోనియా, షకీర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. జకీర్ తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. సీఐ పాపారావు, ఎస్ఐ రాజశేఖర్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించండి

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థుల వసతి గృహాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్ డిమాండు చేశారు. శనివారం హాస్టళ్లలోని సమస్యలపై విద్యార్థులతో కలసి వార్డెన్ ప్రొఫెసర్ దామోదర్‌రెడ్డితో చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ హాస్టళ్లలో దాదాపు పేద విద్యార్థులే ఉన్నారని, తక్షణం పెంచిన మెస్ బిల్లులను తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని కోరారు. ఈ విషయంపై వార్డెన్ స్పందిస్తూ వీసీ అప్పారావుకు సమస్యలను వివరించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు కొండ యుగంధర్, రూకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జయహో ఇండియా!



పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు కాంస్య పతకం సాధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. శనివారం పలువురు హాకీ క్రీడాకారులు, అభిమానులు చంద్రగిరిలో సంబరాలు చేసుకున్నారు. చంద్రగిరి హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి ర్యాలీగా టవర్‌క్లాక్ వద్దకు చేరుకున్నారు. అనంతరం కూడలిలో బాణసంచా కాల్చి సందడి చేశారు. కేక్ కట్ చేసి పండగ చేసుకున్నారు. హాకీ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస రెడ్డి, రూపకుమార్‌రెడ్డి, లవకుమార్‌రెడ్డి, రాజు, సీనియర్ హాకీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

– చంద్రగిరి